క్లుప్తంగా

రైతులకు అవగాహన



భీమవరం(వత్సవాయి): వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం భీమవరం గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఏ సి.భవాని మాట్లాడుతూ పత్తి పంట ప్రస్తుతం పూత, పిందె దశలో ఉన్న సందర్భంగా ప్రత్యేకమైన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఈ దశలో ముఖ్యంగా తెల్లదోమ వచ్చే అవకాశాలు ఉన్నందున వ్యవసాయశాఖ సిబ్బంది సూచనల మేరకు మందులను పిచికారీ చేసుకోవాలన్నారు. ముందుగా వేపనూనె పిచికారీ చేస్తే మేలన్నారు. వరిపంటలో తొలిదశలో వచ్చే చీడపీడల నివారణ గురించి రైతులకుద్దతి గురించి తెలిపారు. కార్యక్రమం అవగాహన కల్పించారు. విత్తనశుద్ధి, వరినారు కొనలను కత్తిరించి నాటుకునే పద్ధతిని వివరించారు. కార్యక్రమంలో ఏవో వి.రవికుమార్ పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిరావాలని పిలుపు



పెనుగంచిప్రోలు: విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్ర ఆవరణలో సెప్టెంబర్ నాలుగోతేదీన జరుగనున్న తొలి తెలుగు కవయిత్రి, శాలివాహన ఆడపడుచు మొల్లమాంబ విగ్రహావిష్కరణకు శాలివాహనులంతా తరలిరావాలని జిల్లా శాలివాహన సంఘ అధ్యక్షులు బొమ్మిన శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆహ్వానపత్రికలను ఆవిష్కరించి స్థానిక సంఘ నాయకులను అందజేశారు. ఈవిగ్రహావిష్కరణకు మైసూర్ మహారాజ్, కర్ణాటక ఎంపీ యదువీర కృష్ణదత్త చామరాజ వడియార్ హాజరవుతున్నారని వివరించారు. కార్యక్రమంలో సంఘ విజయవాడ అధ్యక్షులు భర్తవరపు దుర్గాప్రసాద్, కార్యదర్శి దేగుప్తపు సత్యనారాయణ మూర్తి, స్థానిక సంఘ నాయకులు సముద్రాల లక్ష్మణరావు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, బాడిశ చిన్నమీరయ్య, సంగెపు ఆంజనేయులు, సముద్రాల కొండలు, బాడిశ పకీరయ్య, సముద్రాల వీరరాఘవులు, వరికల్లు గోపాలరావు, సముద్రాల కృష్ణ పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

నందిగామటౌన్: నందిగామ మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమణబాబు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని బాబు జగ్జీవన్‌రాం భవనంలో చైర్‌పర్సన్ ఓర్సు లక్ష్మి అధ్యక్షతన ఉదయం 11గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు వివరించారు. సభ్యులంతా హాజరుకావాలని కమిషనర్ కోరారు.

50మంది రక్తదానం



వీరులపాడు: ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదిన ఉత్సావాలను పురస్కరించుకుని ఆయన అభిమానులు మండలంలోని జుజ్జూరులో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని తహసీల్దార్ రాజకిషోర్‌తో కలిసి జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తంబళ్లపల్లి రమాదేవి ప్రారంభించారు. శిబిరంలో 50మంది పాల్గొని రక్తదానం చేశారు. నాయకులు వరకుమార్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన

కంచికచర్ల : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యూనిఫైడ్ పెన్షన్ స్కీంను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి డి.హరిప్రసాద్, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ పులి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం కంచికచర్ల, వీరులపాడు మండలాల యూటీఎఫ్ సంఘ నాయకులు నిరసన ప్రదర్శన చేశారు.ఈసందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు కాని భిక్ష కాదన్నారు. ఈనెల 22న పార్లమెంట్‌లో ఆమోదం తెలిపిన యూనిఫైడ్ పెన్షన్ స్కీంకి కేంద్రం తక్షణమే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వి.జాహ్నవికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి కె.గేశ్వరరావు, నాయకులు మల్లారపు రామారావు, వేణుగోపాలస్వామి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

చందర్లపాడు(నందిగామ టౌన్): విద్యుదాఘాతంతో రెండు గేదెలతో పాటు వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చందర్లపాడులో జరిగింది. సేకరించిన సమాచారం మేరకు చందర్లపాడు గ్రామానికి చెందిన పంది కుమార్ (48) పశువులను మేపేందుకు సమీపంలోని పొలాలకు వెళ్లాడు. ఈక్రమంలో విద్యుత్ తీగలు తెగి పడి ఉండటాన్ని గమనించని కుమార్ అటుగా వెళ్లడంతో తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మేత కోసం తోలుకెళ్లిన రెండు గేదెలు సైతం మృత్యువాత పడ్డాయి. విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగిందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైద్యసిబ్బందిలో ఆత్మస్థైర్యం నింపాలి



ప్రజలకు నిస్వార్థంగా సేవలందించే వైద్యులు, వైద్య సిబ్బందిపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. కోల్‌కతాలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి. ప్రత్యేక చట్టం ద్వారా వైద్యుల్లో ఆత్మస్థైర్యం నింపాలి. అందుకు అవసరమైన చట్టాలను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు రూపొందించాలి.

\- డాక్టర్ అనిల్‌కుమార్, వైద్యాధికారి, బూచవరం



వైద్యుల రక్షణకు పటిష్ట చట్టాలు అవసరం



మహిళా వైద్యుల్లో ఆత్మవిశ్వాసం పెరగాలంటే సమాజం నుంచి మద్దతు అవసరం. వైద్యులు, వైద్యారోగ్య సిబ్బంది ప్రత్యేక రక్షణ కల్పించేందుకు ప్రభుత్వాలు పటిష్ట చట్టాలు రూపొందించాలి. వైద్యశాలల్లో 24గంటల విధులు నిర్వహించే సమయంలో రాత్రిళ్లు ఇబ్బందులు వస్తుంటాయి. ఆ సమయంలో తప్పనిసరిగా భద్రత ఉండాలి.

\- అనూష, సీహెచ్‌వో, షేర్‌మహ్మద్‌పేట

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



పేట శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో మంగళగౌరి వ్రతంలో పాల్గొన్న మహిళలు



మక్కపేటలో కుంకుమపూజల్లో పాల్గొన్న మహిళలు

జగ్గయ్యపేట అర్బన్: శ్రావణమాస నాలుగో శుక్రవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని అమ్మవారి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈసందర్భంగా స్థానిక నకాశిబజారులోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో సామూహిక మంగళ గౌరివ్రతాలు నిర్వహించారు. అద్దాలబజారులోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయం, దుర్గాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయం, అయ్యప్పనగర్‌లోని అయ్యప్ప స్వామి ఆలయంలోని అష్టలక్ష్మి సహిత వైభవలక్ష్మి తదితర ఆలయాల్లోని అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, కుంకుమార్చనలు చేశారు. నకాశిబజారులోని కనకదుర్గ అమ్మవారిని గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. మహాలక్ష్మి అమ్మవారి వెండిదేవాలయంలో శ్రీమహాలక్ష్మి హోమం నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా వెండి దేవాలయం ఆలయ కమిటీ చైర్మన్ అత్తులూరి వెంకటేశ్వర్లు, ఆలయాల కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి: శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా మండలంలోని పలు ఆలయాలు మహిళలతో నిండిపోయాయి. శ్రావణమాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం పలు ఆలయాల్లో కంకుమపూజలు చేశారు. మక్కపేటలోని శ్రీ ద్వాదశ జ్యోతిర్లింగ అయ్యప్ప ఆలయం, వత్సవాయి వాసవీకన్యకాపరమేశ్వరీ ఆలయంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. కుంకుమపూజలు అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అర్చకులు అత్తలూరి యుగంధర్‌శర్మ, దాములూరి సంగయ్యశర్మ, రేలంకి భాస్కర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేకాలంకరణలో ఈశ్వరీమాత



గాజుల అలంకరణలో పేట శ్రీకనకదుర్గ అమ్మవారు



గొట్టుముక్కలలో అంకమ్మ అమ్మవారు

జగ్గయ్యపేట మండలంలో..

జగ్గయ్యపేట:శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో మండలంలోని ఆలయాల్లోని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమార్చనలు, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసంలో నాలుగవ శుక్రవారం కావటంతో మహిళలు కుంకుమ పూజలతోపాటు వాయినాలు ఇచ్చుకున్నారు. పట్టణంలోని వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలోని ఈశ్వరీమాతను పలురకాల పండ్లతో అలంకరించారు. నవమాతలను గాజులతో అలంకరించారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : శ్రావణ శుక్రవారం సందర్భంగా మండలంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని గొట్టుముక్కలలో అంకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు పసుపు కుంకుమలు సమర్పించారు. స్థానిక మహాలక్ష్మీ ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు చేశారు.



పెనుగంచిప్రోలులో పూజల్లో పాల్గొన్న ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు, ఈవో లీలాకుమార్



శ్రీతిరుపతమ్మ ఆలయంలో వరలక్ష్మీవ్రతంలో పాల్గొన్న మహిళలు

ఇన్‌వాయిస్ ఉంటేనే ఇసుక లోడింగ్

జేసీ నిధిమీనా

కంచికచర్ల : ఇసుక కోసం ఇన్‌వాయిస్ తీసుకున్న కొనుగోలుదారులకు మాత్రమే స్టాక్ పాయింట్ వద్ద ఇసుక లోడింగ్ చేయాలని జాయింట్ కలెక్టర్ నిధిమీనా ఆదేశించారు. స్థానిక అధికారులతో కలిసి మండలంలోని కీసర, మోగులూరు ఇసుక స్టాక్ పాయింట్‌లను జేసీ శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా జేసీ నిధిమీనా మాట్లాడుతూ ఇన్‌వాయిస్ లేని వాహనాలకు ఇసుక లోడింగ్ చేస్తే కఠినచర్యలు తప్పవన్నారు. స్టాక్ పాయింట్ వద్ద రెవెన్యూ, మైనింగ్, సెబ్, పోలీస్‌శాఖ సిబ్బందిని నియమించామని, కాని ఆ అధికారులు స్థానికంగా కొంతమంది వ్యక్తులతో లాలూచీపడి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఏరోజు ఇసుక బుక్‌చేసుకున్న వ్యక్తులకు అదేరోజున ఇసుక లోడింగ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం స్టాక్ పాయింట్ వద్ద గతంలో ఉన్న ఇసుక స్టాక్ ఎంత?..ఇప్పుడు ఎంత ఉంది. ఎంత లోడింగ్ జరిగిందనే వివరాలను ఆరా తీయడంతోపాటు ఆ రికార్డులను పరిశీలించారు.

స్టాక్ పాయింట్ ఇన్‌చార్జిల తొలగింపు..

స్టాక్‌పాయింట్ వద్ద విధులు నిర్వర్తించే ఇద్దరు ఇన్‌చార్జి అధికారులను ఈనెల 31వ తేదీ నుంచి విధులకు రావద్దని జేసీ ఆదేశించారు. కీసర స్టాక్ పాయింట్ వద్ద విధుల నిర్వర్తించే ఇన్‌చార్జి మండల పరిషత్ కార్యాలయ సూపరిండింటెంట్ కె.బాలశంకరరావు, మోగులూరు స్టాక్‌పాయింట్ ఇన్‌చార్జి, పరిటాల గ్రామ కార్యదర్శి మీర్జావలిమహ్మద్‌లను ఆ విధుల్లోంచి తప్పిస్తున్నట్లు జేసీ ఆదేశించారు. ఆస్థానంలో వేరేవారిని నియమించినట్లు వివరించారు. అక్రమంగా ఇసుకను లోడింగ్ చేస్తున్న జేసీబీ కాంట్రాక్టర్‌ను కూడా తొలగించారు. జేసీ వెంట ఆర్డీఓ ఏ రవీంద్రరావు, తహసీల్దార్ వి.జాహ్నవి, ఎంపీడీఓ కానూరు శిల్ప, రూరల్ సర్కిల్ సీఐ డి.చవాన్, సెబ్ సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ బి.రాజు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



కీసర స్టాక్ పాయింట్ వద్ద ఇసుక లోడింగ్‌ను పరిశీలిస్తున్న జేసీ నిధిమీనా, ఆర్డీఓ రవీంద్రబాబు



స్టాక్ పాయింట్ వద్ద రికార్డులను తనిఖీ చేస్తున్న జేసీ నిధిమీనా

గాజుల అలంకారంలో సత్యమ్మ అమ్మవారు



నందిగామ టౌన్:మండలంలోని అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారి ఆలయంలో శ్రావణ మాస ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ మహోత్సవాలలో భాగంగా నాలుగో శుక్రవారం అమ్మవారు గాజుల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఈవో సీతారామయ్య మాట్లాడుతూ భక్తులు, దాతల సహకారంతో పలురకాల గాజులతో అమ్మవారికి గాజుల అలంకారం నిర్వహించినట్లు తెలిపారు. తొలుత అమ్మవారికి ఖడ్గమాల, సామూహిక కుంకుమార్చనలు, మహా గణపతి, నవగ్రహ, మహా సరస్వతి, మహాదుర్గ, మహాలక్ష్మి, శ్రీసూక్త, మన్య సూక్త, చండీ రుద్ర, వారాహి, బగళాముఖి, మృత్యుంజయ హోమాది క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గాజుల అలంకారానికి సహకరించిన దాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



శనగపాడులో మొక్కలు నాటుతున్న ఎంపీపీ గాంధీ, పక్కన సర్పంచ్ సైదులు, గ్రామస్తులు



అడవిరావులపాడులో మొక్కలు నాటుతున్న ఎంపీపీ, ఎంపీడీవో



చిల్లకల్లులో మొక్కలు నాటుతున్న ప్రత్యేకాధికారి మహేశ్వరరావు

శనగపాడు(పెనుగంచిప్రోలు): పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఎంపీపీ మార్కపూడి గాంధీ అన్నారు. వనం–మనం కార్యక్రమంలో భాగంగా శనగపాడు జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో శుక్రవారం ఆయన మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య నివారణకు మొక్కలను పెంచాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. చెట్లను నరికివేయరాదని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కీసర సైదులు, ఎంపీటీసీ సభ్యులు కీసర లోకేశ్వరరావు, ఏపీఓ తిరుపతయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు. అదేవిధంగా పెనుగంచిప్రోలు బాలికల జెడ్పీ హైస్కూల్‌లో ఎంపీడీఓ సాయిహర్ష మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం పెంచేందుకు ప్రభుత్వం వనం–మనం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటుతోందని వివరించారు. ప్రతి పాఠశాల, ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లకు ఇరువైపుల మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో రవీంద్ర, ఏఓ సిద్ధారెడ్డి, పంచాయతీ కార్యదర్శి శ్యామ్, నాయకులు గజ్జి కృష్ణమూర్తి, చుంచు రమేష్ పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామ టౌన్:మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించవచ్చని ఎంపీపీ ఆకుల హనుమంతరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు పేర్కొన్నారు. వనం–మనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అడవిరావులపాడు, ఐతవరం, సోమవరం, రుద్రవరం, జొన్నలగడ్డ, మునగచర్ల, గోళ్లమూడి, కొణతమాత్మకూరు గ్రామాల్లో శుక్రవారం వారు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యం కోసం అందరూ మొక్కలు పెంచాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ప్రత్యేకాధికారి ...

చిల్లకల్లు(జగ్గయ్యపేట):ప్రతిఒక్కరు మొక్కలు నాటాలని జగ్గయ్యపేట మండల ప్రత్యేకాధికారి మహేశ్వరరావు పిలుపునిచ్చారు. వనం–మనం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో శుక్రవారం ఆయన మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు. ఎంపీడీవో రమేష్‌బాబు, తహసీల్దార్ నాగరాజు, ఏపీవో రామకృష్ణ, అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలని చైర్మన్ పిలుపు...

జగ్గయ్యపేట అర్బన్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర పిలుపునిచ్చారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. స్థానిక బలుసుపాడు రోడ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలతోపాటు విష్ణుప్రియనగర్‌లోని 150 అడుగుల జాతీయ జెండాస్తూపం చుట్టూతా చైర్మన్ రాఘవేంద్ర, కమిషనర్ నాగమల్లేశ్వరరావు మొక్కలు నాటారు. ఈసందర్భంగా చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ మొక్కలకు రోజూ నీరుపోసే బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్ గింజుపల్లి వెంకట్రామయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు కాశి కిషోర్, చిరంజీవి, అటవీశాఖ అధికారులు విద్యాసాగర్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.లక్ష్మీసుజాత, ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: పర్యావరణ సమతుల్యత కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని అల్లూరు సర్పంచి బందెల రాణి సూచించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న వనం–మనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అల్లూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఆమె మొక్కలు నాటారు. ఎస్ఎంసీ చైర్మన్ అంకమరావు, మండల ప్రత్యేకాధికారి సుభాని, ఎంపీడీవో అరుంధతీదేవి, ఏపీవో జనార్దన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అల్లూరులో మొక్కలు నాటుతున్న సర్పంచి బందెల రాణి



జెండా స్తూపం వద్ద మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్మన్ ఆర్.రాఘవేంద్ర, కమిషనర్ నాగమల్లేశ్వరరావు తదితరులు



గురుకుల పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న చైర్మన్ రాఘవేంద్ర, విద్యార్థులు, అటవీశాఖ అధికారులు

ఆటో బోల్తా-ఒకరికి గాయాలు



వేమవరం(వత్సవాయి):ఆటో బోల్తా పడి ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిలా ముదిగొండ మండలం వల్లాపురానికి చెందిన కొందరు ఆటోలో పెనుగంచిప్రోలు శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయానికి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చి, తిరిగి వెళ్తుండగా వేమవరం గ్రామ శివారులో వీరి ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో వడ్లమూడి ముత్తయ్య అనే వ్యక్తి తీవ్రగాయాలు కావడంతో అతన్ని ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ పి ఉమామహేశ్వరరావు సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జిమ్ సెంటర్‌పై దాడి-ఇద్దరికి గాయాలు

నందిగామటౌన్: రైతుపేటలోని వారియర్స్ జిమ్ సెంటర్ పై కొంతమంది వ్యక్తులు దాడిచేసిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది.సేకరించిన సమాచారం మేరకు పట్టణానికి చెందిన నవీన్(షాహన్ షా) అనేవ్యక్తి తన స్నేహితులు 20మందితో కలిసి మద్యంమత్తులో వారియర్స్ జిమ్‌పై దాడి చేశాడు. ఈ ఘటనలో జిమ్‌లోని సామగ్రి ధ్వంసంకాగా, జిమ్ యజమాని, ట్రైనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

దివ్యాంగులను ఆదుకోవాలని వినతి



జగ్గయ్యపేట అర్బన్: దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని నియోజకవర్గ దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు వడ్డేపూడి ఉమామహేశ్వరరావు కోరారు. రాష్ట్ర దివ్యాంగుల సంఘం చైర్మన్ కోటేశ్వరరావును శుక్రవారం ఆయన అమరావతిలో కలిసి వినతిపత్రం అందజేశారు. దివ్యాంగుల సమస్యలను వివరించి, ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించాలని కోరినట్లు వడ్డేపూడి వివరించారు.

3న జాబ్‌మేళా

జగ్గయ్యపేట అర్బన్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శ్రీమతి గెంటేల శకుంతలమ్మ కళాశాలలో సెప్టెంబరు 3వ తేదీ ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వై.అంకయ్య, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ నరేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో వివిధ రంగాలకు చెందిన ఆరు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఫార్మసీ అర్హత కలిగిన విద్యార్థులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సెల్‌నంబరు 9014943757లో సంప్రదించాలని వారు సూచించారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



నందిగామ టౌన్: పరిసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యతని మున్సిపల్ కమిషనర్ రమణబాబు పేర్కొన్నారు. పట్టణంలోని వాసవి మార్కెట్, పాత బస్టాండ్, కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ వ్యాపారులు చెత్తాచెదారాలను రోడ్డుపై పడేయకుండా చెత్తకుండీలను వినియోగించాలన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు తమవంతు చర్యలు తీసుకుంటున్నామని ప్రజలు, వ్యాపారులు కూడా అందుకు సహకరించాలని కోరారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.